క్లుప్తంగా...

నేటి నుంచి శిఖర ప్రతిష్ఠాపనోత్సవాలు



పోస్టర్ విడుదల చేస్తున్న లెనిన్‌బాబు

చాంద్రాయణగుట్ట: పూల్‌బాగ్‌లోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ద్వయాహ్నిక ఆంజనేయ స్వామి గర్భాలయం మహా శిఖర ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం నుంచి రెండు రోజుల పాటు జరుపనున్నట్లు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బాశెట్టి లెనిన్ బాబు తెలిపారు. ఆలయ ఈఓ శ్రీనివాస్, పునర్నిర్మాణ దాత అల్లం శ్రీనివాస్‌తో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. 3న ఉదయం 8.30 గంటలకు విశ్వక్సేనారాధన, సాయంత్రం 6 గంటలకు మూల కుంభారాధన, మహా మన్యు సూక్తహోమం, 4న హోమం, ద్వార బలిహరణ, అనంతరం ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ ప్రతిష్ఠాపనోత్సవాలు జరుగుతాయన్నారు.

ఎల్‌పీజీ సిలిండర్ ధర తగ్గించడం హర్షం



కార్వాన్‌లో సంబరాలు చేస్తున్న దృశ్యం

గోల్కొండ: మహిళలకు ఎల్‌పీజీ సిలిండర్‌పై ధర తగ్గించి ప్రధాని మోదీ మహిళలకు అంతులేని ఆనందాన్ని ఇచ్చారని బీజేపీ గోల్కొండ జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు గంజి రఘునాథ్ అన్నారు. ఎల్‌పీజీ సిలిండర్‌పై మోదీ ధర తగ్గించడంతో ఆయన ఆధ్వర్యంలో శనివారం కార్వాన్‌లో మహిళలు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించుకున్నారు. నేడు మహిళా లోకం మోదీకి కృతజ్ఞతలు తెలుపుతుందని గ్యాస్ ధర తగ్గింపుతో పేద, మధ్య తరగతి మహిళలకు ఎంతో ఊరట లభించిందని ఆయన అన్నారు.

వన్ నేషన్.. వన్ ఎలక్షన్ మంచిదే



పంకజ్‌కుమార్ అగర్వాల్

చార్మినార్: వన్ నేషన్.. వన్ ఎలక్షన్ అనే కార్యక్రమం దేశానికి ఎంతో మేలు చేస్తుందని హైదరాబాద్ అగర్వాల్ కుంభ మేళా వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. శనివారం ఆయన రికాబ్‌గంజ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ.. దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి కాపాడడమే కాకుండా ఐదేళ్ల పాటు నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడానికి వీలు పడుతుందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం 1952, 1957, 1962లలో దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరిగాయని ఆయన గుర్తుచేశారు.

బాలభవన్ ఉపాధ్యాయుడికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



కప్పరి కిషన్

నాంపల్లి: జవహర్ బాల భవన్‌లో చిత్రలేఖనం విభాగంలో చిత్రలేఖన ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కప్పరి కిషన్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2023కు ఎంపికయ్యారు. హైదరాబాద్ జిల్లాకు చెందిన కప్పరి కిషన్ 30 ఏళ్లగా జవహర్ బాలభవన్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. కప్పరి కిషన్ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందుకున్నారు. చిత్రలేఖన విభాగంలో విద్యార్థులకు తర్ఫీదును ఇచ్చిన తనకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2023కు ఎంపిక కావడంపై ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈనెల 5న గురు పూజోత్సవం రోజున రవీంద్ర భారతిలో అవార్డును విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధ్యక్షతన జరిగే సభలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అందుకుంటున్నట్లు తెలిపారు.

నాటక రంగాన్ని కాపాడుకుందాం



కళాకారులతో జంగయ్యగౌడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న నాటక రంగాన్ని కాపాడుకోవాలని పలువురు ప్రముఖులు అన్నారు. కిడ్స్ డ్రామా నటన వేసవి శిక్షణ శిబిరం సీజన్-5 రెండు నెలల ముగింపు వేడుకలను శనివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకచక్రం నాటకాన్ని చిన్నారులు అద్భుతంగా ప్రదర్శించారు. విశ్రాంత ఉపాధ్యాయులు దొంతు జంగయ్య గౌడ్, డబ్బింగ్ కళాకారులు శ్రీకర్, శరణ్య, సంస్థ వ్యవస్థాపకులు రమేష్ కిషన్‌గౌడ్ పాల్గొన్నారు.

పేదల కళ్లల్లో ‘డబుల్’ ఆనందం



గౌస్‌నగర్‌లో డబుల్ ఇళ్లను ప్రారంభిస్తున్న హోం మంత్రి మహమూద్ అలీ, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజాసింగ్, బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్

చాంద్రాయణగుట్ట: దేశంలోనే తెలంగాణను నంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడ గౌస్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం 270 మంది లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లలో తెలంగాణను ముఖ్యమంత్రి అన్ని విధాల అభివృద్ధి చేశారన్నారు. పాతబస్తీలో త్వరలోనే మెట్రో రైలు నిర్మాణ పనులు కూడా ప్రారంభమవుతాయన్నారు.

చాంద్రాయణగుట్టలో 630 డబుల్ ఇళ్ల పంపిణీ..

చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో 630 మందికి డబుల్ ఇళ్లను పంపిణీ చేయనున్నామని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలపారు. ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ప్రత్యేక చొరవతో గౌస్‌నగర్‌లో రూ.55 కోట్లతో నిర్మించిన 270 మందికి పంపిణీ చేస్తున్నామని.. మరో 360 ఇళ్లను 4-5 నెలల్లో అందిస్తామన్నారు. మహేశ్వరంలోని మంఖాల్‌లో 230 లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. జంగమ్మెట్‌లో కూడా రూ.23.50 కోట్లతో 270 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని.. త్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ తహసీల్దార్ జయమ్మ, కార్పొరేటర్లు షబానా హఫీజ్ పటేల్, ఫహద్, సలీం బేగ్, అబ్దుల్ వాహబ్, రహమాన్, మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్, బీఆర్ఎస్ చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు బస్సుల ఏర్పాటు..

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూమ్‌లకు ఎంపికైన లబ్ధిదారుల కోసం ప్రభుత్వం 20 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది. సీతారామ్‌బాగ్‌లో శనివారం ఉదయం ఈ బస్సులను గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, కార్పొరేటర్ శశికళ కృష్ణ ప్రారంభించారు. లబ్ధిదారులను కొల్లూరుకు తీసుకువెళ్లి డబుల్‌బెడ్ రూమ్‌లను ఇప్పించారు. కార్పొరేటర్ శశికళ కృష్ణ, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్, బీజేపీ కన్వీనర్ ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వెంటే మజ్లిస్ పార్టీ..

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. శనివారం ఆయన కార్వాన్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన డబుల్ బెడ్ రూమ్ ఇంటి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మజ్లిస్ ఎప్పుడు ప్రజలకు ఇచ్చిన మాటలు నిలబెట్టుకుంటుందన్నారు.

సొంతింటి కల నెరవేరింది: మిత్రకృష్ణ

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో సుమారు 500 నిరుపేద కుటుంబాలకు లక్కీ డ్రా ద్వారా డబుల్ ఇళ్లు లభించడంతో సొంతింటి కల నెరవేరిందని కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. ఈ మేరకు శనివారం కార్వాన్ నియోజకవర్గంకు చెందిన నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పట్టాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గ్రేటర్‌లోని అన్ని నియోజకవర్గాలకు చెందిన పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించడం హర్షణీయమన్నారు.



లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్



పట్టాలు అందజేస్తున్న మిత్రకృష్ణ

కళలు సంస్కృతికి ప్రతీక



ప్రసిద్ధకు బహుమతిని ప్రదానం చేస్తున్న దృశ్యం

గన్‌ఫౌండ్రీ: కళలు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహించిన 48వ అఖిలభారత పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూచిపూడి, భరతనాట్యం, కథక్, కర్ణాటక సగీతం వంటి విభిన్న రంగాల్లో 48 సంవత్సరాలుగా జాతీయస్థాయిలో పోటీలను నిర్వహించి కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమి చైర్మన్ దీపికారెడ్డి మాట్లాడుతూ.. తమ సంస్థ తరఫున కళాకారులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. జూనియర్ వయోలీన్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన ప్రసిద్ధ ప్రథమ స్థానంలో నిలిచారు. అంతకు ముందు కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ డిప్యూటీ డైరెక్టర్ వసుంధర, సంస్థ అధ్యక్షులు వేమరాజు విజయ్‌కుమార్, సంగీత విద్వాంసులు బ్రహ్మశ్రీ లోకనాథ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ నాయకుడికే బీఆర్ఎస్ టికెట్ ఇవ్వండి



మాట్లాడుతున్న పలువురు వ్యాపారులు

అబిడ్స్: ఉద్యమ నాయకుడికే గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ టికెట్ కేటాయించాలని పలువురు వ్యాపారులు సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్లయివుడ, హార్డ్‌వేర్, అల్యూమీనియం, ఆటోమొబైల్, గ్లాస్, బ్యాంగిల్స్, టింబర్, ల్యామినేట్ అసోసియేషన్ల నాయకులు సతీష్‌రెడ్డి, రమేష్ అసోవా, ధినేష్ బండ్దారి, ప్రసాద్, ఎం.కృష్ణ, ప్రవీణ్‌గుప్తా, రాకేష్, వినోద్‌పటేల్, మూర్తి, శివానంద్‌తో పాటు పలువురు వ్యాపారులు మాట్లాడుతూ.. 20 ఏళ్లకు పైగా బీఆర్ఎస్‌లో ఉండి ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యమ నాయకుడు బెజిని శ్రీనివాస్‌కు టికెట్ ఇస్తే వ్యాపారులంతా అండగా ఉండి గెలిపిస్తామన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి



పూజలు చేస్తున్న శ్యాంరావు ముదిరాజ్

చార్మినార్: వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పాతబస్తీ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ కొనియాడారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన శనివారం సాయంత్రం మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆయన మన మధ్య లేకపోయినప్పటికీ పాతబస్తీ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు.



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆచార్య పెదారపు చెన్నారెడ్డి

వైఎస్సార్ మేలును మరువలేను..

నాంపల్లి: వైఎస్సార్ మేలును మరువలేనని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీశైల ప్రాంగణం మాజీ పీఠాధిపతి, దక్షిణ భారత చరిత్ర కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు ఆచార్య పెదారపు చెన్నారెడ్డి గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలను వేసి నివాళులర్పించిన ఆయన ప్రసంగించారు. వైఎస్సార్‌తో ఉన్న అనుబంధాన్ని వివరించారు.

నాంపల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



నాంపల్లి: నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం పటేల్‌వాడలో ప్రారంభమైంది. ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్‌రావు శనివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీనియర్ నేతలు, డివిజన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కో ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై 4న మహా ధర్నా

అబిడ్స్: బీఆర్ఎస్ ప్రభుత్వ హామీలు, వైఫల్యాలపై నిరసనగా ఈనెల 4న మహా ధర్నా నిర్వహిస్తామని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర టీడీపీ నాయకులు ప్యాట నందకిశోర్ పేర్కొన్నారు. సోమవారం రోజు ఉదయం నగరంలోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఈ మహాధర్నా కొనసాగుతుందన్నారు. గోషామహల్ నియోజకవర్గంతో పాటు పెద్ద ఎత్తున అన్ని ప్రాంతాల నుంచి కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌తో పాటు పలువురు అగ్ర నాయకులు పాల్గొంటారని ప్యాట నందకిశోర్ వెల్లడించారు.

బొమ్మ తుపాకీతో బెదిరించిన యువకుడి అరెస్ట్

చాంద్రాయణగుట్ట: బొమ్మ తుపాకీతో హోటల్ సిబ్బందిని బెదిరించిన యువకుడిని శాలిబండ పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పి.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిబండకు చెందిన ముజీబ్-ఉర్-రహెమాన్(29) సయ్యద్ అలీ చబుత్రాలోని షాగౌస్ హోటల్‌లో గత ఐదేళ్ల నుంచి మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 1న సాయంత్రం హోటల్‌కు వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆర్డర్ ఇచ్చిన చాయ్‌ను పార్సల్‌గా తీసుకున్నాడు. సదరు యువకుడు చాయ్ తాగేందుకు ప్లాస్టిక్ డిస్పోజల్ గ్లాసులు అడగడంతో.. ఒక్కోగ్లాస్ రూ.2 లు ఖర్చవుతుందని చెప్పడంతో.. ఆగ్రహానికి గురైన ఆ వ్యక్తి..నేను రెగ్యులర్ కస్టమర్‌ని..నన్నే అడుగుతారా అంటూ...తన వద్ద ఉన్న బొమ్మ తుపాకీని తీసి టేబుల్‌పై పెట్టి బెదిరించాడు. పట్టుకునేందుకు సిబ్బంది ప్రయత్నించగా పరారయ్యాడు. మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల దర్యాప్తు ఆధారంగా బెదిరించిన వ్యక్తి శాలిబండకు చెందిన సవూద్ బిన్ అబుబాకర్(23)గా పోలీసులు గుర్తించారు. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

న్యూసెన్స్ కేసులో వ్యక్తికి జైలు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో తాగిన మైకంలో రోడ్లపై న్యూసెన్స్ చేసిన వ్యక్తిపై న్యాయస్థానం ఆరు రోజుల జైలు శిక్షను విధించింది. ఇన్‌స్పెక్టర్ గురునాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టకు చెందిన ఇమ్రాన్‌ఖాన్ అనే యువకుడు మద్యం సేవించి చాంద్రాయణగుట్ట రహదారులపై న్యూసెన్స్ చేస్తుండడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచారు. దీంతో న్యాయమూర్తి లలిత ఆరు రోజుల జైలు శిక్ష, రూ.100ల జరిమానా విధించారు.

మజ్లిస్ నాయకులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలి



గోల్కొండ, టోలిచౌకి డివిజన్ల మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ నాయకులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండ బడాబజార్‌లో టోలిచౌకి, గోల్కొండ డివిజన్ మజ్లిస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ ఏరియా కమిటీ నాయకులే కాకుండా మజ్లిస్ సీనియర్ నాయకులు తమతమ ప్రాంతంలోని ప్రజలతో సత్‌సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను కూడా వివరిస్తుండాలని అర్హులైన వారికి వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకే కాకుండా సీఎంఆర్‌ఎఫ్ తదితర పథకాలకు ధరఖాస్తు చేసుకోవాలని సూచించి, దరఖాస్తు ఏ విధంగా చేసుకోవాలో కూడా వారికి సూచించాలన్నారు. నాయకులు హరూన్‌ఫరాన్, మిర్జా ఎక్బాల్ అహ్మద్, అబ్దుల్ రహీం, బద్దరుద్దీన్ తదితరులున్నారు.

‘కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరిస్తున్నారు’



కార్వాన్‌లో ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో నాయకుడు కృష్ణ

గోల్కొండ: తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని కాంగ్రెస్ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు కురకుల కృష్ణ అన్నారు. శనివారం ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీలో భాగంగా ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, ప్రజలకు కాంగ్రెస్ చేసిన సేవలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సెక్యూలర్ విధానాల వల్లే సుదీర్ఘంగా దేశంతో పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాన్ని పాలించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు కలిసి మెలిసి సుఖ సంతోషాలతో ఉన్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముంగి రఘుపాల్‌రెడ్డి, అప్సర్ యూసుఫ్‌జాహీ, ఆకుల చంద్రశేఖర్, గిరి, గోవర్ధన్‌రెడ్డి, అహ్మద్ ఖాన్, ప్రేమ్‌కిషోర్, రామ్‌కుమార్ తదితరులున్నారు.

జోరుగా ఓటరు నమోదు

గోల్కొండ: తెలంగాణలో ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పరాభవం తప్పదని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. శనివారం గుడిమల్కాపూర్‌లో ఆయన ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఓటరు లిస్టులో తమపేర్లు నమోదు చేసుకునేవారంతా బీజేపీకే ఓటు వేస్తున్నారని ఓటరు లిస్టులో పేర్లు ఉన్న వారు సైతం బీఆర్ఎస్ పాలనతో విసుగెత్తిపోయారని ఆయన అన్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వివిధ రకాల పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు దేవర వంశీ, జి.సునీల్‌యాదవ్ తదితరులున్నారు.



గుడిమల్కాపూర్‌లో ఓటరు నమోదులో అమర్‌సింగ్ తదితరులు

నియామకం



మల్సూర్‌కు నియామక పత్రం అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

గన్‌ఫౌండ్రీ: ఈనెల 10న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే బీసీల సింహగర్జనను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఇది బీసీల ఆత్మగౌరవ సభ అని లక్షలాది మంది బీసీలు తరలి రావాలన్నారు. శనివారం బషీర్‌బాగ్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర మల్సూర్‌ను నియమించారు. ఈ సందర్భంగా మల్సూర్ మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో రాష్ట్రస్థాయి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి విభాగం జాతీయ అధ్యక్షులు విక్రమ్‌గౌడ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు శ్యామ్‌కురుమ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు పెద్ద ఎత్తున చేపట్టాలి



ఓటర్ల నమోదులో పాల్గొన్న పాండు యాదవ్, మాణిక్ ప్రభు

అబిడ్స్: ఓటర్ల నమోదును జీహెచ్ఎంసీ పెద్ద ఎత్తున చేపట్టాలని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వి.పాండుయాదవ్ పేర్కొన్నారు. ఓటు హక్కు ఎంతో విలువైందని, అర్హులందరూ ఓటరు లిస్టులలో పేర్లు లేనిచో నమోదు చేయించుకోవాలన్నారు. శనివారం గోషామహల్, కార్వాన్ నియోజకవర్గాల్లో ఆయన పర్యటించి పలు క్యాంపెయినింగ్ అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పాండుయాదవ్ మాట్లాడుతూ.. బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో అధ్యక్షుడు మాణిక్ ప్రభు, ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణాగుప్తా ప్రజలకు ఓటు హక్కుపై నిరంతరం అవగాహన చేపడుతున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బోయిని దర్శన్, అల్వాల్ ఇంద్రసేన, ఆకుల గోవర్ధన్, నామ యాదగిరి, అనంత కృష్ణ పాల్గొన్నారు.

అన్నదానం



అబిడ్స్: టీఎస్జీఓస్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో దాదాపు 600 మంది రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమంలో చేపట్టారు. యూనియన్ దివంగత నేత ఎంఎం చంద్రశేఖర్ వర్ధంతి వేడుకల సందర్భంగా ఈ అన్నదానం నిర్వహిస్తున్నామని ముజీబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కే ఆర్.రాజ్‌కుమార్, విక్రమ్‌కుమార్ ఉమర్‌ఖాన్, కుద్రాడి శ్రీనివాస్, సుజాత, అరుణజ్యోతి, సుధాకర్, వాహీద్, ఉస్మాన్‌అలీ, రామకృష్ణారెడ్డి, రోహిత్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం పరిశీలన



గౌలిపురా: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేకంగా కొనసాగుతున్న ఓటరు నమోదు పరిశీలన కార్యక్రమాన్ని శనివారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, శక్తి కేంద్ర ఇన్‌చార్జి ఇ.సుమన్‌కుమార్ ముదిరాజ్, బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు జి.రఘుకాంత్ ఆధ్వర్యంలో గౌలిపురా డివిజన్ పటేల్‌నగర్‌లోని 41, 43 పోలింగ్ కేంద్రాలను బీఎల్‌ఓతో కలిసి ఓటరు లిస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా తమ పేరును ఓటరు లిస్టులో నమోదు చేసుకోవాలన్నారు.

ఆదిత్య-ఎల్1లో కీలక పాత్ర పోషించిన మిధాని

సంతోష్‌నగర్: ఇస్రో ద్వారా శనివారం ఉదయం 11.50 గంటలకు శ్రీహరికోట నుంచి ఆదిత్య-ఎల్1 విజయవంతంగా ప్రయోగించిన సందర్భంగా మిధాని ఇస్రోను ప్రత్యేకంగా అభినందించింది. ఈ ముఖ్యమైన ప్రాజెక్టు కోసం ప్రత్యేకమైన లోహాలు, మిశ్రమాల సరఫరా ద్వారా దాని సహకారం పట్ల చాలా గర్వంగా చాటి చెప్పింది. ఆదిత్య-ఎల్1 లాంచర్ వాహనం పీఎస్ఎల్‌వీ-సీ57, అనేక ఇతర భాగాల్లో మిధాని తయారు చేసిన క్లిష్టమైన పదార్థాలను ఉపయోగించారు. లాంచర్ మిధాని ముఖ్యమైన భాగాల నుంచి తయారు చేశారు. టీఐ-6ఏఎల్-4వీ టైటానియం మిశ్రమం పీఎస్-4 ట్యాంక్, గ్యాస్ బాటిల్స్‌లో ఉపయోగించబడ్డాయి. సీ-103 నియోబియం మిశ్రమం పీఎస్-4 థ్రస్ట్ కేస్, 15సీడీవీ6 మోటార్ కేస్ పట్టీ, బేస్ రింగ్‌లో ఉపయోగించారు. ఇస్రో ప్రారంభం నుంచి తాజా ప్రాజెక్టుల వరకు మిధాని ద్వారా తయారు చేయబడిన ప్రత్యేక పదార్థాలను సరఫరా చేయడంలో బలమైన నిబద్ధతను కరబరిచింది. ఈ సందర్భంగా మిధాని సీఎండీ సంజయ్ కుమార్ ఝా మాట్లాడుతూ.. భారతదేశం మొట్ట మొదటి సౌర మిషన్ విజయవంతంగా ప్రారంభించబడిన ఆదిత్య-ఎల్1 వంటి అంతరిక్ష ప్రాజెక్టులతో ఇస్రో మన దేశానికి, ముఖ్యంగా ఆత్మనిర్భరతకు గౌరవాన్ని సంపాదించి పెట్టిందన్నారు.

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-II
Triveni Complex, Abids, Hyderabad
SA No. 1172 OF 2017

Between:
Sri. Mukka Raja Reddy,
Rep. by its Authorized Person ...Applicant
And
Axis Bank,
Rep.by its Authorized Officer and others ...Respondents

To: Respondents No. 2 to 6
2. M/s Chinnamile Projects LLP Rep. by its Directors Situated at # 4th Floor, Flat No. 402, Bhabukhan Estate, Basheerbagh, Hyderabad.
3. Mr. C. Satyanarayana Reddy, Director of M/s Chinnamile Projects LLP
4. Mr. C. Anji Reddy, Director of M/s Chinnamile Projects LLP
5. Mr. C. Devender Reddy, Director of M/s Chinnamile Projects LLP
6. Mr. C. Mahipal Reddy, Director of M/s Chinnamile Projects LLP
No. 3 to 6 are R/o # 4th Floor, Flat No. 402, Bhabukhan Estate, Basheerbagh, Hyderabad.

It is informed to you, that my client above named applicant filed the above SA No. 1172 of 2017 before the Hon'ble Debt's Recovery Tribunal - II, Hyderabad against you and the same was posted on 18.09.2023 and the Hon'ble Tribunal directed to serve the notice to you. This is for your information and notice for your appearance. If you do not appear on that day i.e. 18.09.2023 the matter will be decided on merits Hence this Notice

By order of the Hon'ble Debts Recovery Tribunal - II, HYDERABAD
D.RAGHAVULU, Advocate

సాక్షి

మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.

9010221230
9010463222
9553955684